TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 295 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.21.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## అడ్డగోలు అకా'డమ్మీ'లు



ఖమ్మం.అమృత్ తెలంగాణ:నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్, ఐఐటీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలు అకాడమీలు పుట్టుకొస్తున్నాయి. మాయమాటలతో తల్లిదండ్రులను బురిడీ కొట్టించి విచ్చలవిడి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో అకాడమీల పేరుతో ఇంటర్ చదువును వ్యాపారంగా మార్చుతున్నారు. ఎడ్యుకేషన్ సొసైటీలు, కోచింగ్ సెంటర్ల పేరిట విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇంటర్ బోర్డు, విద్యాశాఖ అనుమతి లేకుండా ఐఐటీ, జేఈఈ, నీట్ అకాడమీలు వెలుస్తున్నాయి. రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్నారు. భారీ హోర్డింగులతో ప్రచారం చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఐఐటీ, నీట్, ఎమ్ సెట్ అకాడమీలు ఇంటర్ బోర్డు పరిధిలోకి రావని బోర్డు అధికారులు చెబుతున్నారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని అంటున్నారు. అటువంటి అకాడమీల్లో చేరి మోసపోవద్దని, తల్లిదండ్రులు జాగ్రత్తగా పరిశీలించి అనుమతి ఉన్న కళాశాలల్లో చేర్పించాలని సూచిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల సదరు పరీక్షల కోచింగ్ సెంటర్లు, అకాడమీలకు ఇంటర్ బోర్డు నుంచి నోటీసులు అందాయి. కానీ చర్యల విషయంలో ఇంటర్ బోర్డు అధికారులు వెనకాడుతుండటం గమనార్హం.

అనుమతి అధోగతి

2019 నుంచి రాష్ట్రంలో ఏ ఒక్క ఇంటర్మీడియట్ కాలేజీకి అనుమతి ఇవ్వలేదు. కనీసం కాలేజీల పేర్ల మార్పిడికి కూడా పర్మిషన్ లేదు. కళాశాలల షిఫ్టింగ్ పర్మిషన్స్ కూడా లేవు. అయినప్పటికీ అకాడమీలు, కాలేజీలు వెలుస్తుండటం చర్చనీయాంశం అవుతోంది. అకాడమీల్లో ఎక్కడా ఇంటర్మీడియట్ బోధన చేయరాదనే నిబంధన ఉంది. అనుభవజ్ఞులైన, సరైన విద్యార్హతలున్న లెక్చరర్లు, వారికి సంబంధించిన అర్హత సర్టిఫికేట్లు బోర్డుకు సమర్పించాల్సి ఉంటుంది. కానీ ఇటువంటి ప్రమాణాలేవీ పాటించకుండా అకాడమీలను నిర్వహిస్తుండటం వివాదాస్పదమవుతోంది. ప్రభుత్వం అకాడమీలను జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలోకి తీసుకొచ్చింది. కానీ దీనిపై డీఈవోలకు స్పష్టమైన ఆదేశాలు సైతం లేవు. అటు ఇంటర్ బోర్డు పరిధిలోకీ రాక.. ఇటు పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి రాకపోవడంతో అకాడమీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏదో ఒక గుర్తింపు పొందిన కళాశాల నుంచి పరీక్షలు రాయిస్తూ ఆ కళాశాల కంటే కూడా అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు.

కనీస వసతులు లేకున్నా రూ. లక్షల్లో ఫీజులు

ఈ అకాడమీల్లో కనీస వసతులు లేకున్నా రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఏ అకాడమీలో చూసినా రూ. లక్షకు తక్కువ ఫీజు ఎక్కడా లేదు. అనుమతులు లేకున్నా లాంగ్ టర్మ్ కోచింగులు ఇస్తూ ఏడాదికి డే స్కాలర్కు రూ.లక్షన్నర వరకూ దండుకుంటున్నారు. హాస్టల్ కమ్ ఇంటర్మీడియట్ సెకండియరైతే రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అయినా ఏ ఒక్కరూ అడిగే పరిస్థితి ఉండటం లేదు. ఏ బోర్డుకూ ఈ అకాడమీలపై అజమాయిషీ లేదు.

ఎంఈవోల నివేదికలో ?అకాడమీల బాగోతం వెల్లడి

రాష్ట్రంలోని పలు నగరాల్లో 100కు పైగా కోచింగ్ సెంటర్లు, అకాడమీలు విద్యాశాఖ అనుమతి లేకుండా నడుస్తున్నాయని ఇటీవల ఎంఈవోల రహస్య సర్వే ద్వారా విద్యాశాఖ గుర్తించింది. చాలా సెంటర్లలో నవోదయ, కోరుకొండ, గురుకులం విద్యాలయాల ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇచ్చే ట్యుటోరియల్స్ అనుమతి లేకుండా నడుస్తున్నాయని నివేదిక ఇచ్చారు. ఇంత జరుగుతున్నా పుట్టగొ డుగుల్లా వెలుస్తున్న అకాడమీలు మాత్రం తగ్గడం లేదు.

ఈ నిబంధనలు తప్పనిసరి

అకాడమీల్లో శిక్షణకు వచ్చే వారంతా కూర్చోవడానికి అనుకూలమైన కుర్చీలు, బల్లలు ఉండాలి. విశాలమైన శిక్షణ గదులు, గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు ఉండాలి. గ్రంథాలయం తప్పనిసరి. శిక్షకుల విద్యార్హతల సర్టిఫికెట్లు విద్యాశాఖ అధికారులకు అందుబాటులో ఉండాలి. బోధకుల విద్యార్హతల్లో తేడా ఉంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ అదేశాలు అమలు చేయాలి.

విద్యార్థులు మోసపోవద్దు: ?రవిబాబు, డీఐఈవో, ఖమ్మం

జిల్లాలో అనుమతిలేని అకాడమీలు, కోచింగ్ సెంటర్లలో ప్రవేశాలు పొంది విద్యార్థులు మోసపోవద్దు. ఏ అకాడమీకి ప్రభుత్వ గుర్తింపు లేదు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఇంటర్ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలి. కొన్ని అకాడమీలను ఇంటర్ కాలేజీ పేరుతో అనుమతులు తీసుకొని నిర్వహిస్తున్నారు. అటువంటి వాటిపై బోర్డు అజమాయిషీ ఉంటుంది.

## దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బుధవారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్బరేలీలో పర్యటించారు. అక్కడ నిర్వహించిన –బహుజన స్వాభిమాన్ సభ'లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని, అది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, డా.బి.ఆర్. అంబేద్కర్, మహాత్మాగాంధీ, వీరపాసి వంటి మహనీయుల సిద్ధాంతాలకు, అలాగే కేరళలో నారాయణ గురు, కర్ణాటకలో బసవన్న వంటి సంస్కర్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. బుద్ధుడు, గురునానక్, కబీర్ వంటి వారి గొంతుకలు కూడా రాజ్యాంగంలో ప్రతిబింబించాయని, అలాంటి పత్రాన్ని తప్పక పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు కేవలం మహనీయుల విగ్రహాలకు నివాళులు అర్పించడమే కాకుండా, రాజ్యాంగంపై మరియు అది సూచించిన భావజాలంపై దాడులు జరిగినప్పుడు వాటిని రక్షించుకునేందుకు ఎదురుతిరగాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం ప్రతి ఒక్కరిదీ అని, ఏ కులానికో, ఒక వ్యక్తికో, బిలియనీర్కో లేదా సంస్థకో చెందినది కాదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చేసిన పొదుపు సూచనలను ప్రస్తావిస్తూ, రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరుగుతుందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆహార ధాన్యాలు అన్నింటి ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని, ఆ వెంటనే తానే స్వయంగా ఐదు దేశాల పర్యటనకు వెళ్లారని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, కులగణన నిర్వహించకపోవడం, కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించడం ద్వారా ప్రధాని మోడీ రోజుకు 24 గంటలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల లాభాలకే ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తోందని ఆరోపించారు. అంతకుముందు రాయ్బరేలీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ విప్లవకారుడు వీరపాసికి ఘనంగా నివాళులర్పించారు. మహనీయులను స్మరించుకుంటున్నాం కానీ, వారి సిద్ధాంతాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడంలో వెనుకబడుతున్నామని, ఈ ధోరణి మారాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇరాన్ పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం : సి ఆర్ ఎస్ నివేదిక



వాషింగ్టన్ : ఇరాన్ పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ ఎస్ ) ఒక నివేదికలో తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది. వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ ఎస్ తెలిపింది. ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ-4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్-15ఇ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్-35ఎ లైట్నింగ్ 2 స్టీల్త్ ఫైటర్ జెట్, ఒక ఎ-10 థండర్బోల్ట్ గ్రౌండ్-అటాక్ ఎయిర్క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. శత్రువుల దాడిలో ఏడు కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఇ-3 సెంట్రీ అవాక్స్ (ఎడబ్ల్యుఎసిఎస్ ), నిఘా విమానం, రెండు ప్రత్యేక ఆపరేషన్ల విమానాలు, ఒక హెచ్హెచ్-60డబ్ల్యూ రెస్క్యూ హెలికాప్టర్ దెబ్బతిన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. యుఎస్ కాంగ్రెస్, కమిటీలకు విధానపరమైన, చట్టపరమైన విశ్లేషణను అందించే సిఆర్ ఎస్, రక్షణ శాఖ, యుఎస్ సెంట్రల్ కమాండ్ వార్తా నివేదికలు, ప్రకటనలను పరిశీలించడం ద్వారా ఈ నష్టాలను అంచనా వేసింది. అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయని పెంటగాన్ తాత్కాలిక కాంప్ట్రోలర్ జూల్స్ డబ్ల్యు హర్స్ట్ 3 ప్రతినిధుల సభలో అంగీకరించిన సంగతి తెలిసిందే.ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.2.4 లక్షల కోట్లు) చేరినట్లు ఆయన తెలిపారు.

## నార్వే జర్నలిస్టుకు చేదు అనుభవం





హైదరాబాద్: అమృత్ తెలంగాణ:భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడి నార్వే పర్యటన వేళ .... నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో అనూహ్య ప్రశ్న సంధించి వార్తల్లో నిలిచిన నార్వే మహిళా జర్నలిస్టు హెల్లే లింగ్ చేదు అనుభవం ఎదురైంది. ఆమె సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేస్తూ మెటా షాక్ ఇచ్చింది. ఈ విషయాన్ని ఆమె కూడా ధ్రువీకరించారు.

హెలె లింగ్ ట్వీట్ చేస్తూ .... తన ఖాతా నిలిపివేయబడటానికి ముందు రోజంతా తన ఇన్స్టాను యాక్సెస్ చేయలేకపోయానని తెలిపారు. "పత్రికా స్వేచ్ఛ కోసం చెల్లించాల్సిన చిన్న మూల్యమే ఇది, కానీ ఇలాంటి అనుభవం ఇంతకు ముందెప్పుడూ ఎదురు కాలేదు," అని ఆమె తన సస్పెన్షన్ నోటీసు స్క్రీన్ షాట్ షేర్ చేశారు. మెటా యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్స్ ద్వారా తనను సంప్రదించడానికి ప్రయత్నిస్తున్న వినియోగదారులకు, తన ఇన్స్టా, ఫేస్బుక్ ఖాతాలు రెండూ సస్పెండ్ అయ్యాయని మరో పోస్ట్లో లింగ్ తెలియజేశారు. తాను వీలైనంత ఎక్కువ మంది భారతీయులకు స్పందించాలనుకున్నా, కానీ ఇప్పుడు అది లేట్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కానీ తన ఖాతాలు తిరిగి యాక్టివ్ అవుతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తన పోస్ట్కు ఆమె మెటాను కూడా ట్యాగ్ చేస్తూ రాశారు. కాగా, ప్రధాని మోడి పత్రికా సమావేశంలో తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదంటూ ఇన్స్టాగ్రామ్ పోస్ట్ బాగా వైరల్ అయింది. ఆమె ఫాలోవర్లు కూడా పెరిగారు. దీనిపై బిజెపి శ్రేణులు లింగ్‌పై విరుచుకుపడగా, పలువురు నెటిజన్లు విభిన్నంగా స్పందించారు.

## పాత్రికేయులు ఆధునిక ?సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



హైదరాబాద్.అమృత్ తెలంగాణ: నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమం జరిగింది. పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందనీ, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందన్నారు. ఉదుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలన్నారు. గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు (ూ×) ప్రభావం పెరుగుతున్నదనీ, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణంగా మార్పులు అవసరమనీ, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు, గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుంచి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. ఈ చర్చా కార్యక్రమంలో కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ, రెడ్డి, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ, తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి శ్రీ నాగులపల్లి వెంకటేశ్వర రావు సంయుక్తగా శాలువాలతో సత్కరించారు.

# గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజ్







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఆమె అన్ని జిల్లా కలెక్టర్ లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో కలిసి కలెక్టరేట్ విసి హాల్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. అలాగే, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్దేశించిన రుణాల లక్ష్యాలను వంద శాతం వేగంగా చేరుకోవడంతో పాటు, కొత్తగా మహిళా సంఘాల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గ్రామీణ యువతరం, బాలికల సాధికారత కోసం 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల వారితో నూతనంగా 'స్నేహ' గ్రూపులను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో చేరాలనే ఉద్దేశంతో ఆసరా, చేయూత పెన్షన్ దారులకు సంబంధించి ఫేస్ అథెంటికేషన్, డెత్, మైగ్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం పెన్షన్లు పొందుతున్న వారి లబ్ధిని పారదర్శకంగా కొనసాగించేందుకు వీలుగా లైవ్ ఫేస్ అథెంటికేషన్, అర్హతల క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (NFBS) ద్వారా అందే రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అర్హులైన కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలులో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డిఓ రవీందర్ రాథోడ్, జిల్లా పరిషత్ సీఈఓ రవి, డిపిఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపిడిఓలు, సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిరిచెల్మ ఆలయంలో ఘనంగా 'హెరిటేజ్ వాక్' నిర్వహణ




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ (KGBV) బంగారిగూడ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థుల్లో పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ హెరిటేజ్ వాక్ నిర్వహించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిరిచెల్మ ఆలయ చరిత్ర, స్థానిక సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అన్వేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ బేల న్యూస్ బేలా మండల కేంద్రంలో ఆదిలాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,బోత్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామా రూపేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. యువ నాయకులు ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత సమాజ సేవలో ముందుండటం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలి : అన్వేష్ రెడ్డి

## రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది : బోరంచు శ్రీకాంత్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు మరియు డీలర్స్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన డీలర్ల అవగాహన సదస్సుకు సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా దిగుబడులు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటిస్తూ డీలర్లు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ప్రతి డీలర్ బాధ్యత అని అన్నారు. రైతులు మోసపోకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం విత్తనాల విక్రయాలు జరగాలని సూచించారు. విత్తనాల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, వాటిని రైతులకు చేరవేయడంలో డీలర్లు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన డీలర్లు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# నకిలీ సంతకాలతో రూ.12 లక్షల అక్రమ నగదు బదిలీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

**ఉట్నూర్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి పి. మౌనిక తీర్పు.**

**మోసం, నకిలీ పత్రాల తయారీ కేసులో నిందితులకు కారాగార శిక్షతో పాటు జరిమానా విధింపు.**

**ఐటీడీఏ సొమ్మును వాడుకున్న నిందితులు : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో 2017 సంవత్సరంలో నమోదైన క్రైం నం.61/2017, సీసీ నం.393/2021 కేసులో గౌరవనీయ ఉట్నూర్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి పి. మౌనిక ఈ రోజు తీర్పు వెలువరించారు. ఫిర్యాదుదారు జాధవ్ గోవింద్ రావు ఫిర్యాదు మేరకు, ఐటిడిఏ ఉట్నూర్ పరిధిలో నిరుద్యోగ యువత శిక్షణల కోసం వినియోగించే ఈజీఎంఎం బడ్జెట్ నిధుల నుంచి నకిలీ సంతకాలతో వౌచర్లు తయారు చేసి వివిధ ఖాతాలకు మొత్తం రూ.12 లక్షలు అక్రమంగా బదిలీ చేసినట్లు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో నిందితులు కినిమొల శ్రీనివాస్ (26 సంవత్సరాలు), పెందూర్ జలీమ్ (25 సంవత్సరాలు), ఇద్దరూ ఇచ్చోడ నివాసులు ఫిర్యాదుదారుడి సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమంగా నగదు బదిలీ చేసినట్లు రుజువైంది. ఈ కేసులో కోర్టు డ్యూటీ అధికారి 16 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పీపీ ఎం. మౌనిక సమర్థవంతంగా వాదనలు వినిపించగా గౌరవ న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడు కినిమొల శ్రీనివాస్‌కు 2 సంవత్సరాల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించగా, మరో నిందితుడు పెందూర్ జలీమ్‌కు 1 సంవత్సరం సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.300 జరిమానా విధిస్తూ గౌరవనీయ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ-1 నిందితుడు మృతి చెందినట్లు తెలిపారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టులో పటిష్టమైన ఆధారాలు సమర్పించిన ఉట్నూర్ పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి : నకిలీ, లూజ్ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

## ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి : తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం



సమావేశానికి హాజరైన అధికారులు మరియు డీలర్స్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ బ్యూరో న్యూస్ జిల్లా జెడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓలు (FPOలు), ఏఆర్‌ఎస్‌కే కేంద్రాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతులతో నేరుగా అనుసంధానం ఏర్పరచుకొని, రైతుల ద్వారానే విత్తన ఉత్పత్తి చేపట్టి, అవసరమైన ప్రమాణ పరీక్షల అనంతరం నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తోందని తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంట మార్పిడిని ప్రోత్సహించాలని, పత్తికి బదులుగా కంది, పెసర, మినుములు, సోయాబీన్ వంటి అపరాలు, నూనె గింజలు, కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా NFSNM పథకం ద్వారా 284 క్వింటాళ్ల కందుల విత్తనాలను 100 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే NMEO పథకం ద్వారా సోయాబీన్ సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని, కూరగాయల సాగుకు కూడా ప్రభుత్వం మద్దతు అందిస్తోందని చెప్పారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. పత్తి విత్తనాల విషయంలో నకిలీ, లూజ్ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన విత్తన రకాలను మాత్రమే రైతులకు సరఫరా చేయాలని డీలర్లకు స్పష్టంగా సూచించారు. సహకార సంఘాలు, ఏఆర్‌ఎస్‌కే కేంద్రాలు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ శాఖ లైసెన్సుతో వ్యాపారం చేస్తున్న ప్రతి విత్తన డీలర్ కూడా విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తి చేసిన విత్తనాలను కొంత పరిమాణంలో తప్పనిసరిగా రైతులకు అందించాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు నాలుగు లక్షల ఎకరాలలో పత్తి సాగు జరుగుతుందని, అవసరమైన మేరకు కంపెనీల వారీగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు, డీలర్లు, సహకార సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపాదిత నూతన విత్తన చట్టం రూపకల్పనలో రైతుల హక్కులతో పాటు విత్తన డీలర్ల హక్కులను కూడా పరిరక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా పత్తి సాగు జరుగుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సీడ్స్ సర్టిఫికేషన్ మెంబర్ మురళీ, జిల్లా వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ అధికారులు (ADAలు), మండల వ్యవసాయ అధికారులు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండలంలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలి

**రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి : బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిశీలన**

**గంజాయి, గుడుంబా, రాయితీ బియ్యం, పశువుల అక్రమ రవాణా పై దృష్టి సారించాలి.**

**గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలి : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**




అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతూ పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి, బజార్హత్నూర్ ఎస్ఐ జి రమేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గౌడన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## పల్లె దవాఖానా తో ప్రజల చెంతకు మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్





జగిత్యాల అమృత్ తెలంగాణ మే 20: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన ను ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.అంతకుముందు గ్రామంలో ప్రమాద వశాత్తూ దగ్ధం అయిన ఈత వనాన్ని పరిశీలించి,కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని,సంబంధిత అధికారులకు ఫోన్ చేసి న్యాయం చేయాలని అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, డి ఎం హెచ్ వో సుజాత,ఎమ్మెర్వో నాగార్జున ఎంపీడీవో చిరంజీవి,డిప్యూటీ డి ఎం హెచ్ వో శ్రీనివాస్,సర్పంచ్ నిరటి శ్రీనివాస్,మోర హనుమండ్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ రావు,కోల శ్రీనివాస్ రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ సాయి రెడ్డి,మాజీ సర్పంచ్ సామల వేణు,జలంధర్,మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్,గౌడ సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సయ్య గౌడ్, సాయ గౌడ్,లక్ష్మణ్ గౌడ్,అరవింద్ గౌడ్, శేఖర్ రెడ్డి,యం ఏముకీద్,తిరుపతి గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బెజ్జంకి మోహన్, వార్డు సభ్యులు,సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు,మండల గ్రామ నాయకులు,వైద్య సిబ్బంది , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలి : పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా, ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రణాళికలో ఉన్న అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులను నిరంతరంగా చేపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణ కు సంబంధించి చేపట్టిన పనుల వివరాలను సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలని వివరించారు. ఈ చర్యలకు గాను గత సంవత్సరం రాష్ట్రానికి ఎన్నో అవార్డులు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధి హామీ పనులు పకడ్బందీగా కొనసాగాలని తెలిపారు. సంబంధిత అధికారులు అందరూ ఎప్పటికప్పుడు ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఉష్ణోగ్రతలు అధికమయ్యే సమయానికి ముందే పనులు ముగించాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల ప్రాంతాలలో ఖచ్చితంగా త్రాగునీరు, టెంట్ ఉండాలని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్పించాలని అన్నారు. ఈ వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం: ఏ ఒక్క నిజమైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు

## గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున బిఎల్ఎ లను నియమించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. జూన్ 25 వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ లు) ఓటర్ల వివరాలకు సంబంధించి ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారం లు ఇస్తారని అన్నారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యూమరేషన్ ఫారం లు జూలై 24 తేదీ వరకు తిరిగి తీసుకుంటారు అని వివరించారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలుపవచ్చునని స్పష్టం చేశారు. వివరాల పరిశీలన తర్వాత, అక్టోబర్ ఒకటవ తేదీన తుది ఎలక్టోరల్ రోల్ జాబితా ప్రదర్శిస్తామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఎ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిలలో సమావేశాలు నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం తహసిల్దార్ లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈఆర్ఓ లు ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఖానాపూర్ ఈఆర్ఓ గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు : మెట్ పల్లి రూరల్



అమృత్ తెలంగాణ మే 20. బుధవారం రోజున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని వెల్లుళ్ల లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.వై . స్వాతి మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్లో ఉన్న వరి రకాల సాగు పై,తక్కువ యూరియా వాడకం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, నిర్దేశించిన పురుగు, తెగుళ్ల, కలుపు మందుల వాడకం లో, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి, పచ్చిరొట్ట పంటల సాగు, నేల ఆరోగ్యం ,అలాగే వరి పంట కోసిన తర్వాత పంట అవశేషాలు కాల్చకుండా నేలలో కలియదున్నటం వంటి వివిధ అంశాల పై రైతులకు అవగాహన కల్పించటం జరిగింది. అదే విధంగా బి శ్రీలక్ష్మి వాతావరణం ఆప్స్ గురించి, వాతావరణ బులెటిన్స్ గురించి వివరించారు.అలాగే ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎ. మమత వ్యవసాయ శాఖ చేయు కార్యక్రమల గురించి యూరియా యాప్ గురించి, వచ్చే వానాకాలంలో తప్పనిసరిగా సన్నరకాలను సాగు చేయాలనీ రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ,క్లస్టర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 20: పట్టణ 42వ వార్డులో 48 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను పరిశీలించి, నాణ్యతతో పనులు చేయాలని, త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్ కౌన్సిలర్ నాగరాజు,బొలుసాని శ్రీనివాస్,డి ఈ ఆనంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాన్,నాయకులు నమీండ్ల శ్రీనివాన్,దానరి ప్రవీణ్,పోతునుక,మహేష్,రాజు,కప్పల శ్రీకాంత్,ఈశ్వర్, ఏ ఈ అనిల్,నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యూత్ లీడర్షిప్ సదస్సు



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్: రిమాండ్ కి తరలింపు

## నిందితుని వద్ద నుండి ఒక కిలో గంజాయి స్వాధీనం : నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్




అమృత తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపిఎస్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి,బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ పాస్వాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడి వద్ద నుండి ఒక కిలో (లక్ష రూపాయల విలువ) గల గంజాయి,ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.విచారణలో నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ దాడిని, స్వాధీనం,విచారణ ప్రక్రియ మొత్తం కూడా ఈ–సాక్ష్య యాప్ ద్వారా వీడియో చిత్రీకరణ చేయడం జరిగింది.నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు

# ధాన్యం రవాణాకు సరిపడా లారీలను కేటాయించాలి : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 20, 2026: జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వరి ధాన్యం రవాణా కు సరిపడా లారీలను కేటాయించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తో కలిసి రవాణా లారీల గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని తరలింపుకు సరిపడా లారీలను కేటాయించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు త్వరితగతిన తరలించి ధాన్యం దిగుమతి వేగంగా అయ్యేలా చూడాలని తెలిపారు. దిగుమతికి అవసరమైన హమాలీల సంఖ్య పెంచుకోవాలని తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక

## రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 20, 2026: జూన్ 2వ తేదీన ఉమ్మడి జిల్లాలో జరగనున్న ఇందిరమ్మ పండుగలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న ప్రాంతాలను బుధవారం రాష్ట్ర ఆబ్కారీ -మధ్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, కె.హరిత, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, అధికారులతో కలిసిహోహొసందర్శించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనేక మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని, జూన్ 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇందిరమ్మ పండుగలో 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇంటి పెద్దగా గుర్తించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇండ్లు మంజూరు చేస్తామని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

## ప్రతీ ఫిర్యాదు పై తక్షణ స్పందన : బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం




అమృత్ తెలంగాణ బైంసా న్యూస్ నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వృద్ధ దంపతులు లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. వారి సమస్యను ఓర్పుతో విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కుటుంబ కలహాల నేపథ్యంలో వచ్చిన తల్లి-కొడుకులతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, పరస్పరం అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇద్దరికీ నచ్చజెప్పి వారి సమస్యకు పరిష్కార మార్గం సూచించారు.వీటితో పాటు భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర :**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష :**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత






అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 20, 2026: గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నియంత్రణ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశానికి హాజరై జిల్లాలో పని చేస్తున్న స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని తెలిపారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చేయాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్లహొహొవివరాలు ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్ కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని, లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని, ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని, పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి అనుమతి తీసుకోవాలని, మూసివేసిన స్కానింగ్ సెంటర్ లో ఉన్న పరికరాలు, యంత్రాలను విక్రయించినట్లయితే కొనుగోలు చేసిన వారి సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని తెలిపారు. స్కానింగ్‌హొహొకేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. అరుణశ్రీ, డా. శ్రీదేవి, డా. సుధాకర్, డా. అభినవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డి. పి. ఓ. ప్రశాంతి, సి హెచ్ ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ హారిక, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన అదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి మరియు కౌన్సిలర్ అంబకంటి అశోక్



మల్లెపూల సత్యనారాయణ చైర్మన్ ను సన్మానిస్తున్న అదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కౌన్సిలర్ అంబకంటి అశోక్

అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలను రెండవ పర్యాయం చేపట్టినటువంటి మల్లెపూల సత్యనారాయణ ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించి సన్మానించ నైనది కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులైన అల్లూరి సంజీవ రెడ్డి మరియు ఓబీసీ జిల్లా అధ్యక్షులు అయిన అంబకంటి అశోక్ కుమార్ సాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గారు బోరిగామా సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ గారు యాకుబ్ గారు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# గ్లిజరీన్ లేకుండానే ఏడ్చాను: చిరంజీవి



రవితేజ మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్ లో మల్టీ స్టారర్ మూవీగా వాల్తేర్ వీరయ్య ప్రేక్షకుల ముందుకి వచ్చింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ మూవీ సూపర్ సక్సెస్ అందుకుంది. ఇక ఈ సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ తో పాటు వింటేజ్ చిరంజీవిని చూసే అవకాశం వచ్చిందనే మాట ఆడియన్స్ నుంచి వినిపిస్తుంది. రెగ్యులర్ కమర్షియల్ కథ అయినా కూడా ఎక్కడ బోర్ కొట్టకుండా దర్శకుడు బాబీ అద్భుతమైన కథనంగా ఆవిష్కరించారు. చిరంజీవి రవితేజ ఈ మూవీలో అన్నదమ్ములుగా నటించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే సెకండాఫ్ ఆరంభంలో రవితేజ క్యారెక్టర్ ఎంటర్ అవుతుంది. క్లైమాక్స్ ముందు చనిపోతుంది. అయితే వీరిద్దరి మధ్య వచ్చే క్లైమాక్స్ ఎపిసోడ్ చాలా ఎమోషనల్ గా సాగుతుంది. రవితేజ చనిపోయే సమయంలో అన్నయ్య వీరయ్యతో జరిగే సంభాషణ ప్రేక్షకులని భాగా కనెక్ట్ అయ్యింది. ఈ సన్నివేశం గురించి తాజాగా జరిగిన సక్సెస్ మీట్ లో చిరంజీవి ఆసక్తికర విషయాలు బయటపెట్టాడు. ఈ సీన్ లో తాను ఎలాంటి గ్లిజరీన్ వాడకుండానే కన్నీళ్లు పెట్టుకున్నా అని చిరంజీవి చెప్పారు. ఆ ఎమోషనల్ సీన్ చేసే సమయంలో నిజానికి రవితేజ కాకుండా ఇంకెవరైనా ఉంటే ఆ స్థాయిలో చేయలేకపోయేవాడినేమో అని రవితేజ చెప్పారు. రవితేజని కేవలం తన తమ్ముడుగా భావించడం వలన ఆ ఎమోషనల్ సీన్ లో గ్లిజరీన్ లేకుండా చేయగలిగానని అలాగే అద్భుతంగా స్క్రీన్ పై ప్రేక్షకులని కంటతడి పెట్టించే విధంగా వచ్చిందని స్టేజ్ పై చిరంజీవి రవితేజని ఉద్దేశించి కామెంట్స్ చేశారు. ఇప్పుడు ఇవి వైరల్ గా మారాయి. అలాగే మా ఇద్దరి కాంబినేషన్ లో వచ్చే అన్ని సీన్స్ కూడా ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పించే విధంగా ఉన్నాయని చిరంజీవి అన్నారు.

# గొప్ప మనసు చాటుకున్న నందమూరి బాలకృష్ణ!



మన టాలీవుడ్ హీరోలు వెండితెరపైనే కాదు రియల్ లైఫ్ లోనూ హీరోలే. ఈ విషయాన్ని పలు సందర్భాల్లోనూ నిరూపించారు కూడా. ఇప్పటికీ తమ పేరు బయటకి రాకుండా పబ్లిసిటీకి దూరంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తమ సహృదయతను చాటుకుంటున్నారు. మహేష్ బాబు వేయి మందికి పైగా చిన్నారులకు హార్ట్ ఆపరేషన్ చేయించి తన గొప్ప మనసుని చాటుకుంటూ ఇప్పటికీ తన వంతుగా సహాయం చేస్తూనే వున్నారు. మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా సహాయం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ తను చేసే సహాయం బయటికి తెలియనివ్వడం లేదు. కానీ తను తోచిన సహాయాన్ని మాత్రం కంటిన్యూ చేస్తూనే వున్నారు. ఇక యంగ్ హీరోల్లో విజయ్ దేవరకొండ కూడా కోవిడ్ నుంచి తనదైన పంథాలో మిడిల్ క్లాస్ కి సహాయం చేస్తూ తన గొప్ప మనసుని చాటుకుంటున్నారు. ఇక అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ కూడా తన వంతుగా ఎంతో మందికి సహాయపడుతున్నారు. తన తల్లి బసవతారకం పేరు మీద నెలకొల్పిన క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా సేవ చేస్తున్నారు. ఎంతో మందికి డబ్బు లేకుండా ఆపరేషన్ లు క్యాన్సర్ చికిత్సలు చేయిస్తున్నారు. డబ్బులు కూడా ఇస్తూ తన గొప్ప మనసును చాటుకుంటున్నారు. రీసెంట్ గా క్యాన్సర్ కి గురైన ఓ అమ్మాయికి తన సొంత ఖర్చులతో వైద్యం చేయించిన బాలకృష్ణ తను హోస్ట్ గా వ్యవహరిస్తున్న అన్ స్టాపబుల్ విత్ ఎన్ బికె టాక్ షో ప్రభాస్ గోపీచంద్ ల ఎపిసోడ్ కు తనని తన ఫ్యామిలీని ఆహ్వానించి వేదికగా సాక్షిగా మరి కొంత మొత్తాన్ని అందించిన సహృదయతను చాటుకున్నారు. తన చుట్టూ వున్న ఆళ్లపై అభిమానులపై బాలయ్య ఫైర్ అవుతాడనే టాక్ వుంది. అది బాలయ్యలోని ఓ కోణం మాత్రమే. తన సహాయం అర్థించకపోయినా ఆపదలో వున్న వారి గురించి తెలుసుకుని బాలయ్య స్పందిస్తుంటారు. ఆ కుటుంబానికి ఆర్థకంగా అండగా వుంటున్నారు. రీసెంట్ గా మరోసారి బాలకృష్ణ తన గొప్ప మనసుని చాటుకుని అందిరి ఆశ్చర్యపరిచారు. అనంతపురంకు చెందిన ఓ అమ్మాయి ఇంటర్ చదువుతూ బోన్ క్యాన్సర్ తో బాధపడుతోంది. తన ట్రీట్మెంట్ కోసం డాక్టర్లు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారట. వారి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే వుండటంతో పాపకు చికిత్స చేయించలేకపోతున్నారట. ఈ విషయం తెలుకున్న నందమూరి బాలకృష్ణ వెంటనే వారికి ఫోన్ చేశారట. విషయం తెలుసుకుని పాప ట్రీట్మెంట్ కోసం డాక్టర్లతో మాట్లాడి వెంటనే ట్రీట్మెంట్ ని మొదలు పెట్టించారట బాలయ్య. ఈ విషయం తెలిసి బాలయ్య అభిమానులు జై బాలయ్య అంటూ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు.

# మరో ఫెస్టివల్ కు టార్గెట్ సెట్ చేసిన సూర్య



కోలీవుడ్ లో స్టార్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపుని సొంతం చేసుకున్న నటుడు సూర్య. జైభీమ్ ఆకాశం నీ హద్దురా సినిమాతో సూర్య గత రెండేళ్ళు సూపర్ బ్లాక్ బస్టర్ హిట్స్ ని తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే నేషనల్ అవార్డులని కూడా సొంతం చేసుకున్నాడు. ఈ రెండు సినిమాలు రిలీజ్ అయిన అన్ని భాషలలో సూపర్ హిట్ అయ్యాయి. కోలీవుడ్ రేంజ్ లోనే తెలుగులో కూడా సూర్యకి మంచి ఫ్యాన్ క్రేజ్ ఉంది. ఆయన సినిమాలకి మంచి ఓపెనింగ్స్ కూడా వస్తాయి. సూర్య నుంచి ఒక సినిమా వస్తుంది అంటే కచ్చితంగా అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది అనే అభిప్రాయం ప్రేక్షకులలో ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం సూర్య శివ దర్శకత్వంలో పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో పీరియాడికల్ బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ తెరకెక్కుతుంది. ఈ సినిమాలో హీరో సూర్య వారియర్ రోల్ లో కనిపించబోతున్నాడు. దిశా పటాని ఈ సినిమాలో హీరోయిన్ గా కనిపించబోతుంది. భారీ బడ్జెట్ తో పాటు భారీ తారాగణంతో ఈ మూవీని దర్శకుడు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. హిస్టోరికల్ నేపథ్యంలో కథని చెప్పబోతున్నాడని తెలుస్తుంది. ఓ విధంగా చెప్పాలంటే సూర్య కెరియర్ లో మొదటి ఇలాంటి హిస్టోరికల్ బ్యాక్ డ్రాప్ లో క్యారెక్టర్ చేస్తున్నాడు.




# కీర్తి సురేష్ రెట్రో లుక్ లో అదరగొట్టేసింది!



క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్ మహానటి తరువాత తన పంథా పూర్తిగా మార్చుకుంది. ఓ పక్క కమర్షియల్ హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే మరో పక్క తన టేస్ట్ కి తగ్గ లేడీ ఓరియెంటెడ్ మూవీస్ చేస్తూ రెండు రకాల సినిమాలతో తన కెరీర్ ని బ్యాలెన్స్ చేసుకుంటూ పక్కా ప్లానింగ్ తో వెళుతోంది. ప్రస్తుతం తెలుగులో నేచురల్ స్టార్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా దసరా లో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీని మార్చి 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీని ఐదు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. ఇక ఈ మూవీతో పాటు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భోళా శంకర్ లోనూ కీర్తి సురేష్ నటిస్తోంది. అయితే ఇందులో తనది హీరోయిన్ క్యారెక్టర్ కాదు. చిరుకు చెల్లెలిగా కనిపించబోతోంది. తమిళ మూవీ వేదాలం ఆధారంగా ఈ మూవీని రీమేక్ చేస్తున్నారు. మెహర్ రమేష్ రూపొందిస్తున్న ఈ సినిమాని ఏకె ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. త్వరలో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇదిలా వుంటే రెండు కమర్షియల్ ఎంటర్ టైనర్ లలో నటిస్తే ఓ హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తున్న కీర్తి సురేష్ తాజాగా ఓ మహిళా ప్రధాన మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com